క్లుప్తంగా

అమ్మవారికి లక్ష కుంకుమార్చన



అమ్మవారికి చీర, పూజా సామాగ్రిని సమర్పిస్తున్న సిరిసహస్ర

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద బూరాడపేట గ్రామంలో ఉన్న బాలా త్రిపుర సుందరీదేవీ ఆలయంలో మాఘ మాసం సందర్భంగా శనివారం లక్ష కుంకుమార్చనలు వైభవంగా జరిగాయి. చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

3న పల్స్‌పోలియో



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: మార్చి 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ కోరారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శానిటేషన్, ఐసీడీఎస్, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పల్స్‌పోలియో డ్రాప్స్ వేయించటానికి తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి



ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధిస్తున్న కేవీ జానకి

విజయనగరం టౌన్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని ప్రవచనమణి కేవీ జానకి అన్నారు. స్థానిక రింగురోడ్డులో ఉన్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాసామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి ఆమె భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. రామాయణంలోని వివిధ ఘట్టాలను కూలంకుషంగా వివరించారు. అనంతరం శ్రీనివాస సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా విజయకుమార్, చెరుకూరి శ్రీధర్ ఆమెను ఘనంగా సత్కరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వసతుల పరిశీలన



కార్యదర్శులకు సూచనలిస్తున్న తహసీల్దార్ ప్రవల్లికప్రియ

పూసపాటిరేగ: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ శనివారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అవసరమైన వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ర్యాంపు, రైలింగ్ ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట కార్యదర్శులు వెంకటరావు, ధనంజయ, తదితరులు ఉన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఎలా ఉన్నారు.. బాగా చదువుతున్నారా లేదా.. ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఒత్తిడిని అధిగమించి పరీక్షలకు ఎలా సన్నద్ధం అయ్యేందుకు అవసరమైన మెలకువలు వివరించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గోడపత్రికను విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.రమణ అన్నారు. స్థానిక ఎల్‌బీజీభవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అన్ని నియోజకవర్గాల్లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం రిలే నిరాహార దీక్షలకు సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.త్రినాథరావు, ఎస్.కృష్ణారావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో 'రాకోడు'

- అభివద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.21.34 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ



రూ.40 లక్షలతో నిర్మించిన సారిక గ్రామ సచివాలయం



విజయనగరం రూరల్: అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లె ప్రగతికి పెద్దపీట వేయడంతో గ్రామాల రూపురేఖలే మారిపోయాయి. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైంది. ప్రభుత్వ సేవలన్నీ గడప వద్దకు చేరుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. గ్రామాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయనగరం మండలం రాకోడు పంచాయతీలో ఈ నాలుగున్నరేళ్లలో కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే సంక్షేమ పథకాల ద్వారా అర్హుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం కోట్ల రూపాయలను జమ చేసింది.

గ్రామంలో చేపట్టిన నిర్మాణాలు

- పౌర సేవలు ప్రజలకు అందించేందుకు వీలుగా రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం
- రైతులకు ప్రభుత్వ సేవలందించేందుకు వీలుగా రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం
- నాడు–నేడు కింద రూ.31.21 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి
- రూ.25 లక్షలతో గ్రామ ప్రధాన రహదారి నిర్మాణం
- రూ.35 లక్షలతో సీసీరోడ్లు, కాలువలు, రిటర్నింగ్ వాల్ నిర్మాణం
- నాడు–నేడు కింద రూ రూ.30.56 లక్షలతో రాకోడు ప్రాథమికోన్నత పాఠశాల, పిన వేమలి ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన

సంక్షేమ ఫలాలు..

సంక్షేమ పథకాల ద్వారా నాలుగున్నరేళ్లలో గ్రామంలోని అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ.21.34 కోట్లు నగదు జమ చేయడం జరిగింది.

- వైఎస్సార్ పింఛన్ కానుక కింద రూ.5.67 కోట్లు
- వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.2.7 కోట్లు
- జగనన్న అమ్మ ఒడి పథకం కింద రూ.1.59 కోట్లు
- వైఎస్సార్ ఆసరా కింద రూ.2.33 కోట్లు
- వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.1.33 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది.

అభివృద్ధే అజెండా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకు పాలనను తీసుకువచ్చారు. అవినీతికి తావులేకుండా పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ఆయన సంకల్పానికి తోడు స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి కృషితో గ్రామాభివృద్ధే అజెండాగా, పేదల సంక్షేమమే పరమావధిగా నడుస్తున్నాం. నాలుగున్నరేళ్ల కాలంలో రెండు గ్రామాల అభివద్ధికి సుమారు రూ.2 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో గ్రామ సచివాలయ భవనం, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాం.

– పాటిపిరెడ్డి వెంకటరరమణ, సర్పంచ్, రాకోడు గ్రామం



రూ.31.21 లక్షలతో అభివద్ధి చేసిన రాకోడు పీహెచ్‌సీ భవనం

పింఛన్ ఆదుకుంటోంది



మేము నిరుపేద కూలీలం. కూలి దొరికితేనే ముద్ద నోటికెళ్లేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న రూ.3 వేల పింఛన్‌తో నెల గడుస్తుంది. ఒక్కోసారి కూలి దొరక్కపోయినా వచ్చే పింఛను డబ్బులే మమ్మల్ని ఆదుకుంటుంది. తమ్ముడిలా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– పి.రామునాయుడు, పింఛన్ లబ్ధిదారుడు, రాకోడు గ్రామం

పెట్టుబడి సాయంతో మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తన తండ్రిలా ఎల్లప్పుడూ రైతుల మేలు కోసం ఆలోచన చేస్తున్నారు. వ్యవసాయానికి సంబంధించి ఎరువులు, విత్తనాలు గ్రామాల్లోనే అందిస్తున్నారు. అలాగే రైతుభరోసా పథకం కింద ఏటా అందిస్తున్న పెట్టుబడి సాయం రూ.13,500లతో మాలాంటి సన్నకారు రైతులకు ఎంతో మేలు కలుగుతోంది.

– బోకం అప్పారావు, రైతు, రాకోడు గ్రామం



రూ.25 లక్షలతో నిర్మించిన రాకోడు ప్రధాన రోడ్డు



రాకోడు గ్రామంలో శ్మశాన వాటికకు నిర్మించిన సీసీ రోడ్డు



రూ.19.56 లక్షలతో అభివృద్ధి చేసిన రాకోడు ఎంపీయూ పాఠశాల



తరగతి గదిలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బెంచీలు, ఇతర వసతులు

వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేద్దాం..

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, అందుకు అందరం సిద్ధం కావాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని కోరుకొండపాలెం గ్రామంలో పార్టీ కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి సంపద సృష్టించారన్నారు. పథకాల అమలులో సిఫార్సులకు, అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ పథకాలు అందించారని, అదే ధైర్యంతో ప్రజల వద్దకు వెళ్లాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలకు, రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు గడప వద్దకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. విద్య, వైద్య రంగాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెప్పుకోడానికి ఏమీలేక మోసపూరిత హామీలతో ప్రజల్లోకి వెళ్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి విజయానికి ప్రతీ కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోని కృష్ణ, పాలకేంద్రం అధ్యక్షుడు కర్రి ఎర్రినాయుడు, ఉపసర్పంచ్ రాము, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్‌తో లెండీ ఎంఓయూ



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ డిప్యూటీ మేనేజర్ డాక్టర్ ఎం.సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ రామారెడ్డి

డెంకాడ: అన్ని రంగాలకు టెలికమ్యూనికేషన్ సాంకేతిక అవసరమని బీఎస్‌ఎన్‌ఎల్ డిప్యూటీ మేనేజర్ డాక్టర్ ఎం.సత్యప్రసాద్ అన్నారు. టెలికమ్యూనికేషన్ రంగంలో ఆవిష్కరణలు పెంపొందించేందుకు లెండీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (విశాఖ) విభాగం మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఒప్పంద పత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ వీ.వీ.రామారెడ్డి, విశాఖ బీఎస్‌ఎన్‌ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.సత్యప్రసాద్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం బీఎస్‌ఎన్‌ఎల్ నిపుణులు విద్యార్థుల వినూత్న ఆలోచలను ప్రోత్సహిస్తారని తెలిపారు. బీఎస్‌ఎన్‌ఎల్ చేపట్టే పలు శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని కళాశాల ఇన్నోవేషన్ సెల్‌కు సహకారం అందిస్తారన్నారు. టెలికమ్యూనికేషన్ రంగం పురోగతిని తెలుపుతూ పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి ఎం.రాజన్‌బాబు, బీఎస్ఎన్ఎల్ అధికారులు సీహెచ్ వరప్రసాద్, బి.ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ సుకుమార్ మిశ్రా, ఎలక్ట్రికల్ విభాగాధిపతి సుబ్బరామయ్య, అధ్యాపకులు సురేష్, జానకీ, శ్రీధర్, ఏవీ పరాంకుశం, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• అ'పూర్వ' కలయిక



పూర్వ విద్యార్థులు

విజయనగరం రూరల్: మహారాజా నగర పాలక మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్ (అయ్యకోనేరు ఉత్తర గట్టు)లో 1970–77 బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి సమావేశానికి హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశం ఏర్పాటుకు కృషి చేసిన డబ్బీరు రాజేంద్రప్రసాద్, కునుకు వెంకటరమణ, ఆర్య సోమయాజుల లక్ష్మీనర్సింహమూర్తి, గన్నవరపు రామచంద్రమూర్తి, కుప్పిలి గిరిజా వెంకటేశ్వరరావులను ఈ సందర్భంగా అభినందించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
- బొడ్డవలసలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



బొడ్డవలసలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

డెంకాడ: ప్రజా శ్రేయస్సు, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుని, వాటి ఫలాలను ప్రజలకు అందించారని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. రఘుమండ, బొడ్డవలసలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను, విజయనగరం–విశాఖ జాతీయ రహదారి నుంచి బొడ్డవలస పంచాయతీ వెలమపేట గ్రామానికి రూ.90 లక్షల వ్యయంతో నిర్మించిన తారురోడ్డు, బొడ్డవలసలో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా బొడ్డవలసలో ఏర్పాటు చేసిన సభలో ఎంపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని, మహిళలు, రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. సంక్షేమ పాలనలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బొడ్డవలస పంచాయతీకి వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా రూ.13.87 కోట్లు ఖర్చు చేశారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది రూపాయలు అందించామన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సంతోషాలు ఇలాగే కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, జగనన్న మళ్లీ సీఎం కావాలని, అందుకు ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ, పోలిపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, బాలి సత్యనారాయణ, ఎంపీడీఓ లవరాజు, తహసీల్దార్ రామారావు, సర్పంచ్‌లు గూడేల విష్ణు, ఎర్ర సన్యాసమ్మ, సువ్వాడ రమేష్, తోరోతు త్రిమూర్తులు, లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీలు విజినిగిరి అచ్చంనాయుడు, పిళ్లా ముసలి నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించాలి



మాట్లాడుతూ ఎంవీజీఆర్ డైరెక్టర్ సీతారామరాజు

డెంకాడ: రాజాసాహెబ్ డాక్టర్ పీవీజీ రాజు విద్యతో పాటు క్రీడలను కూడా ప్రోత్సహించారని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పీఎస్ సీతారామరాజు అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ కళాశాలలో శనివారం డాక్టర్ పీవీజీ రాజు శతజయంతి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీతారామరాజు మాట్లాడుతూ.. ఆత్మసాక్షికి అనుగుణంగా పనిచేయడం పీవీజీ రాజు లక్షణమన్నారు. ఆయన ఆశయాలు సమాజానికి ఎంతో మేలు చేశాయని, ఆ స్ఫూర్తి అందరికీ అవసరమన్నారు. కార్యక్రమంలో మాన్సాస్ కరస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, డీన్ ఎస్.మోహన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ షణ్ముఖరావు, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు తప్పనిసరి

శృంగవరపుకోట: కార్మికశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్.కోట, జామి మండలాల పరిధిలో ఉన్న అన్ని రకాల దుకాణాల యజమానులు రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సహాయ కార్మికఅధికారి కె.కరణ్ చంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1988 సెక్షన్–3 ప్రకారం దుకాణాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, గతంలో రిజిస్ట్రేషన్లు చేయించిన వారు వాటిని రెన్యువల్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ అప్పారావు, తదితరులు

పూసపాటిరేగ: విద్యార్థులు జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకునేందుకు ప్రణాళికతో ముందుకుసాగాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం సందర్శించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. బాగా చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని ఉన్నత చదువులు అభ్యసించాలన్నారు. పరీక్షల సమయంలో ప్రిపరేషన్‌తో పాటు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సైకాలజిస్టులు, వ్యక్తిత్వ వికాస నిపుణులతో విద్యార్థులకు కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం అకడమిక్‌లో విద్యార్థుల ప్రగతి, గత ఏడాది పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో సాధించిన ఫలితాలపై సిబ్బందితో చర్చించారు. జగనన్న గోరుముద్ద వంటలను పరిశీలించారు. ఆయన వెంట బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, తదితరులు ఉన్నారు.

